క్లుప్తంగా

అర్జీల స్వీకరణ



సదస్సులో రైతులతో మాట్లాడుతున్న డీటీ శంకరరాయుడు

భామిని: మండలంలోని లివిరిలో డిప్యూటీ తహసీల్దార్ శంకరరాయుడు ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించి, భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఇటీవల జరిగిన రీ సర్వేలో చోటుచేసుకున్న తప్పులను సరి చేస్తామని డీటీ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజేశ్వరరావు, సహాయ సర్వేయర్ రమణ, వీఆర్ఓ చిన్నారావు, రైతులు పాల్గొన్నారు.

అధ్వానంగా మరుగుదొడ్లు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని మరుగుదొడ్లు

పాలకొండ రూరల్: అత్యవసర సమయంలో అవసరమని పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని మరుగుదొడ్లకు వెళితే నరకం చూడక తప్పదు. ఇక్కడి యంత్రాంగం వాటి నిర్వహణను మరిచింది. కాంప్లెక్స్ ప్రాంగణంలో మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నా సరైన నీటివసతి లేదు. వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసినా వాటి నుంచి నీరు రాకపోవడంతో ఇందులోకి వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చెత్తకు నిప్పు.. పొగతో ముప్పు



చెత్తకు నిప్పు పెట్టడంతో రహదారిపై వ్యాపించిన పొగ

పాలకొండ : నగర పంచాయతీలోని చెత్తను పట్టణ మధ్యలో ఉన్న వెంకటరాయుని కోనేరు గట్టుపై వేస్తున్నారు. చెత్త వేయడం వల్ల వస్తున్న కంపుతో ఓ పక్క పట్టణ వాసులు ఇబ్బంది పడుతుంటే.. మరోవైపు ఆకతాయిలు చెత్తకు నిప్పు పెట్టి మరింత అవస్థలు కలిగేలా చేస్తున్నారు. గురువారం చెత్త కుప్పలకు నిప్పు పెట్టడంతో పట్టణంలో పొగ అలుముకుంది. దీంతో ఆంజనేయనగర్, నీలమ్మకాలనీ, టీచర్స్ కాలనీల్లో ప్రజలు ఊపిరాడక ఇబ్బంది పడ్డారు. అలాగే రోడ్డు కనిపించక వాహన దారులకు అవస్థలు తప్పలేదు.

శ్యామలాంబ పండుగకు మోగిన దండోరా

సాలూరు: పట్టణంలో కొలువైన శ్రీ శ్యామలాంబ పండగ నిర్వహణకు దండోరా గురువారం మోగింది. వచ్చే ఏడాది మే నెల 18,19,20 తేదీలలో పండగ నిర్వహించనున్నట్లు పెద్దలు ప్రకటించారు.ఈ క్రమంలో శ్యామలాంబ ఆలయ అనువంశిక ధర్మకర్త విక్రమచంద్రస న్యాసిరాజు, పెద్దల ఆధ్వర్యంలో దండోరా వేసి పండగ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రజలను కోరారు. యువరాజు ఇంటి నుంచి ఈ దండోరా ప్రారంభించి అల్లు, జన్ని కుటుంబీకుల ఇళ్లు, అమ్మవారి గద్దె వరకు కొనసాగించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన తిరుపతిరావు, నాయకులు,పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముడుపుల పూజలు

సీతానగరం: స్థానిక సువర్ణముఖి నది ఒడ్డున గల వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన లక్ష్మీనృసింహస్వామివారికి భక్తులు ఘనంగా ముడుపుల పూజలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో వందలాది మంది భక్తులు ఆలయాన్ని వచ్చి స్వామివారికి పూజలు నిర్వహించి అభిషేకాలు చేసి, తులసీదళాలతో మాలలు వేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సందడి నెలకొంటుందని, భక్తుల రద్దీనిదృష్టిలో ఉంచుకుని ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంల వరకు ముడుపుల పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు అల్పాహారం వితరణ చేశారు.

ఏరియా ఆస్పత్రికి భవనాల కొరత

- అర్ధంతరంగా నిలిచిన అదనపు భవనాల పనులు
- గదులు చాలక రోగులకు తప్పని అవస్థలు
- బెడ్‌లు వేయడానికి కూడా సౌకర్యాలు నిల్



సీతంపేట ఏరియా ఆస్పత్రి

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి భవనాల కొరత వేధిస్తోంది. దీంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.20 కోట్ల మేర నిధులు మంజూరు కావడంతో 30 పడకల ఆస్పత్రిని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఇందుకు సంబంధించి అదనపు భవన నిర్మాణాలు చేపట్టారు. ఆస్పత్రిపై మరో అంతస్తు వేశారు. పక్కనే మరికొన్ని భవన నిర్మాణ పనులు చేపట్టినా.. నెల రోజుల కిందట నుంచి పనులు నిలిపివేశారు. అప్పట్లో ఆస్పత్రికి అవసరమైన వైద్య సిబ్బందిని నియమించారు. జనరల్ మెడిసిన్, ఆర్థో, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు, ఆప్తాలమిస్ట్, డెంటిస్ట్, గైనిక్ విభాగాలకు సంబంధించి స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఈ ఆస్పత్రికి సీతంపేటతో పాటు భామిని, పాలకొండ, కొత్తూరు మండలాలతో పాటు ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలు సైతం వచ్చి వైద్యసేవలు పొందుతుంటారు. రోజుకు కనీసం 200 ఓపీ ఉంటుందంటే రోగుల తాకిడి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సోమవారం వారపు సంత రోజున 350 పైగానే రోగులు వస్తుంటారు. అయితే ఇందులో చాలా మందిని ఇన్ పేషంట్లుగా చేర్చుకోవాల్సి ఉన్నా.. గదుల కొరత కారణంగా ఇబ్బందులేర్పడుతున్నాయి. చాలీచాలని బెడ్లపై రోగులు అవస్థలు పడుతూ, వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. అధునాతన సౌకర్యాలతో బెడ్‌లు, ఆక్సిజన్ బెడ్‌లు అందుబాటులో ఉన్నా పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. భవనాలు త్వరితగతిన నిర్మిస్తే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు ఎక్స్‌రే, బ్లడ్‌బ్యాంక్‌ల ఏర్పాటుకు ఉపయోగపడతాయి. సదరం సెంటర్ కూడా మంజూరు కావడంతో ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసుకోవడానికి భవనాలు అత్యవసరం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అదనపు భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



అర్ధంతరంగా ఆగిన అదనపు భవనాలు

వైద్య సేవలకు ఆటంకం లేదు



ప్రస్తుతం రోగులకు అందించే వైద్యసేవలకు ఎటువంటి ఆటంకం లేదు. ఉన్న భవనాల్లో సర్దుబాటు చేసి సేవలందిస్తున్నాం. అదనపు గదులు నిర్మాణాలు జరిగితే పూర్తిస్థాయిలో ఎక్విప్‌మెంట్ కూడా పెట్టుకోవడానికి వీలవుతుంది. బెడ్‌ల సమస్య కూడా తీరుతుంది.

– బి.శ్రీనివాసరావు, సూపరింటిండెంట్, ఏరియా ఆస్పత్రి



ఓపీ విభాగం వద్ద క్యూ

అత్యాచార ఘటనపై సమగ్ర దర్యాప్తునకు డిమాండ్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పార్వతీపురం సమీపంలో గల బెలగాంలో నిర్వహిస్తున్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై అధికారులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. గురువారం ఆయన కురుపాంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ సంఘటన జరిగి మూడు రోజులు అయినప్పటికీ ప్రభుత్వంగానీ, అధికారులుగానీ కాలాయాపన చేయడానికి గల కారణం ఏంటని ప్రశ్నించారు. కురుపాం నియోజకవర్గానికి చెందిన విద్యార్థినిపై ఈ ఆఘాయిత్యం జరిగింది కాబట్టి స్థానిక ఎమ్మెల్యే కూడా స్పందించి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులతో మాట్లాడాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకునేలా ఆ ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకూ ఆ కుటుంబం పక్షాన ఆందోళనలు చేపడతామని శ్రీనివాసరావు హెచ్చరించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహంలో పని చేస్తున్న గణిత ఉపాధ్యాయుడు కె.తిరుపతిరావు ఏటా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించేందుకు పోటీలు పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో గురువారం కూడా నిర్వహించారు. గణితంలో హైస్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేశారు. పోటీల్లో ఎస్.దినేష్‌కుమార్, ఎస్.నరేష్, ఎస్.దివాకర్ జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. వీరికి వరుసగా రూ.500, 300, 200 నగదు బహుమతులు అందజేశారు. హెచ్ఎం ఎస్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న హెచ్ఎం

చేప పిల్లల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుమ్మంగి గ్రామంలో గల చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో గురువారం చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎఫ్‌డీఓ గోపీకృష్ణ మాట్లాడుతూ ఈ కేంద్రం వద్ద ఉత్పత్తి చేసిన 10 లక్షల ఫింగర్ ల్లింగ్స్(80–100 ఎంఎం) సైజు గల కట్లా, హోహు, మ్రీగాల్ రకాలను కురుపాం నియోజకవర్గంలోని మత్స్య సహకార సంఘాలకు పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. తోటపల్లి జలాశయం నందు 6 లక్షల చేప పిల్లలు, దుమ్మంగిలోని కిరండల్ చెరువు వద్ద 33 వేల చేప పిల్లలు, గుజ్జువాయి మినీ జలాశయంలో లక్ష చేప పిల్లలు, వట్టిగడ్డ 1.55లక్షల చేప పిల్లలు, జగనాథ్ జలాశయం కోసం 1.55లక్షలు చొప్పున్న చేప పిల్లలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా దుమ్మంగి కిరండల్ చెరువు వద్ద చేప పిల్లలను విడిచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.క్రాంతికుమార్, ఎంపీటీసీ సభ్యు లు కె.మల్లేశ్వరరావు, ఫిషరీష్ అసిస్టెంట్లు వై.వెంగలరాయుడు, ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



దుమ్మంగి చేరువులో చేప పిల్లలను విడిచిపెడుతున్న ఎఫ్‌డీఓ

నట్టల నివారణ మందులు వేయించాలి

గరుగుబిల్లి: గొర్రెలు, మేకల పెంపకందారులు విధిగా నట్టల నివారణ మందులను వేయించాలని పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత నట్టల నివారణ మందుల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకందారులకు పోషణ నిమిత్తం పలు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గొర్రెలు, మేకలు ఆరోగ్యకరంగా ఉండాలంటే నట్టల నివారణ మందులను తప్పకుండా వేయించాలన్నారు. ఈ వ్యాక్సిన్ వల్ల మరణాల శాతం తగ్గడంతో పాటు బరువు పెరిగి ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



గరుగుబిల్లిలో వ్యాక్సిన్లు వేయిస్తున్న సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భామిని: మండలంలోని కొరమ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విద్యుత్ లైన్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో లివిరి నుంచి కొరమ వరకు సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి పశుగణన

గరుగుబిల్లి: మండలంలోని శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీలోగా 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖాధికారి ఎస్.సురేష్ కుమార్ గురువారం తెలిపారు. 21వ అఖిల భారత పశుగణన సందర్భంగా ఇంటింటికి వెళ్లి పశువుల వివరాలు, కోళ్లు, గొర్రెలు, మేకలు తదితర వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

సీపీఎస్ రద్దు పీఆర్‌టీయూతోనే సాధ్యం

భామిని: సీపీఎస్ రద్దు జరగాలంటే మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడునే తిరిగి ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు అమరాపు సూర్యనారాయణ, సీనియర్ నాయకుడు వలరౌతు హరిశ్చంద్రుడు అన్నారు. మండలంలోని బత్తిలి, భామిని, బాలేరు, పెద్దదిమిలి హైస్కూళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూల్ టీచర్లతో గురువారం సమావేశమై పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాగాన విజయ్, పూడి అశోక్ కుమార్, జి.శివకృష్ణ, రాష్ట్ర నాయకులు జక్కు రామినాయుడు, మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

భామిని: విద్యార్థులు ఉన్నత దశకు చేరాలంటే బాల్యం నుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకుని, ఆ దిశగా పయనించాలని సమాజ్ పరివర్తన్ సంస్థ ఆర్గనైజర్ ఎం.నరేష్, బాలేరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జామి రమేష్ అన్నారు. పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు సన్నద్ధం అవుతున్న తరుణంలో వారికి స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో విద్యాభివృద్ధిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరివర్తన్ కమిటీ సభ్యులు బి.చంద్రరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వై.శ్రీనివాసరావు, ఎన్ఎంఎంఎస్ కో ఆర్డినేటర్ మార్కో, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి పనులు పూర్తి చేయాలి

సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలో అర్ధంతరంగా నిలిచిన పలు రహదారులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గిరిజన సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కోసంగి, పాలమానుగూడ, గూడంగి, వంబరెల్లి, హుస్సేనుపురం, తదితర గ్రామాల రహదారులను పూర్తి చేయాలని కోరారు. అలాగే ఈతమానుగూడ, పూతికవలస, ముత్యాలు, దబర, కుమ్మరిగండి గ్రామాల రహదారులు కూడా అధ్వానంగా మారాయని చెప్పారు. రహదారులు పాడవ్వడంతో గిరిజనులు అటవీ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరావు, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపద అభివృద్ధే లక్ష్యం

గరుగుబిల్లి: మత్స్య సంపదను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. తోటపల్లి రిజర్వాయర్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో సుమారు 6లక్షల చేప పిల్లలను(ఫింగర్ లింగ్స్)ను ఆమె రిజర్వాయర్‌లో గురువారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపల పెంపకాన్ని గణనీయంగా పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మత్స్యకారులు చేపల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎస్టీల జీవనోపాధికి అవసరమైన చేప పిల్లలు, వేటకు ఉపయోగపడే పరికరాలను సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ నుంచి మంజూరయ్యేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. చేపల ఉత్పత్తి కేంద్రం హేచరీకి తోటపల్లి రిజర్వాయర్ సమీపంలోని స్థలం మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలం దుమ్మంగి ప్రభుత్వ చేపల పెంపకం కేంద్రం నుంచి 10లక్షల చేప పిల్లలను తీసుకువచ్చామని తెలిపారు. అందులో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకంలో భాగంగా తోటపల్లి రిజర్వాయర్‌లో 6లక్షల చేప పిల్లలను విడిచిపెట్టడం జరిగిందన్నారు. మిగిలిన చేప పిల్లలను ఇతర నీటి వనరులు ఉన్న చోట విడిచిపెడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మరడాన సింహాచలం నాయుడు, మాజీ ఎంపీపీ ఎం.పురుషోత్తమ నాయుడు, నాయకులు అక్కేన మధు, సింహాచలం, మత్స్యసంఘ నాయకులు ఈదర తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లి రిజర్వాయర్‌లో చేప పిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఇవేం బదిలీలు..!

- రాజకీయ నాయకుల జోక్యంతో జాబితాలు తారుమారు

పాలకొండ: మండలంలోని సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో పలు నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతున్న బదిలీలు ఇంకా కొనసాగుతున్నాయి. రిలీవింగ్ ఆర్డర్ల కోసం సచివాలయ ఉద్యోగులు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. గురువారం నాటికి నో అబ్జక్షన్ సర్టిఫికెట్లు అందించాలని వీరికి ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో వాటిని సమర్పించారు. అయితే సాయంత్రానికి రిలీవ్ ఆర్డర్లు ఇస్తామని చెప్పడంతో అక్కడే వేచి ఉన్నారు. ఆరు గంటల సమయంలో ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు రిలీవ్ ఆర్డర్లు ఇచ్చి, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యాదర్శులకు మరో రెండు రోజులు పడుతుందని చెప్పడంతో ఉద్యోగులు ఉసూరోమంటూ వెనుదిరిగారు.

ఇదిలా ఉంటే రాజకీయ నాయకుల జోక్యం వల్ల బదిలీల జాబితాలు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయని, అందుకే అంతా అస్తవ్యస్తంగా తయారైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఎంపీడీఓ కార్యాలయ పరిపాలన అధికారి మురళీధర్ వద్ద ప్రస్తావించగా.. రెండు రోజుల్లో అందరికీ రిలీవ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

స్వైన్ ఫ్లూపై అవగాహన అవసరం

- చిన్న పిల్లల వైద్యుడు రవీంద్రకుమార్

పాలకొండ రూరల్: శీతాకాలం సమీపిస్తున్న తరుణంలో మంచు కారణంగా శ్వాస సంబంధిత వ్యాధులతో పాటు ప్రాణాంతకమైన స్వైన్‌ఫ్లూ వ్యాపించే అవకాశం ఉందని, ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఏరియా ఆస్పత్రి చిన్న పిల్లల వైద్యుడు జె.రవీంద్రకుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆస్పత్రికి వచ్చే రోగులు, చిన్నారుల తల్లిదండ్రులలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాలిలో ఉండే హెచ్–1, ఎన్–1 అనే వైరస్ కారణంగా స్వైన్ ఫ్లూ వ్యాపిస్తుందన్నారు. జలుబు, తీవ్ర గొంతునొప్పి, జ్వరం, దగ్గు, తదితర లక్షణాలు ఎక్కువుగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పిల్లలు, వృద్ధులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉన్న నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ వ్యాధి బారిన పడిన వారు దగ్గినా, తుమ్మినా వారిలో ఉండే హెచ్–1, ఎన్–1 వైరస్ క్రిములు తుంపర్ల రూపంలో గాల్లోకి చొరబడి ఇతరులకు వ్యాపించే అవకాశం ఉందని చెప్పారు. ముఖానికి మాస్కులు ధరించడం , పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.



చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ రవీంద్రకుమార్

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం):

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు సాగు చేస్తున్న పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. కురుపాం మండలంలోని గుజ్జువాయి, మామిడి మానుగూడ, డి.బారామణి గ్రామాల్లో గురువారం ఆయన ఆ పార్టీ నాయకులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి పంటలను పరిశీలించారు. జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, పత్తి పంట సాగుకయ్యే పెట్టుబడి విపరీతంగా పెరిగినందున పత్తి క్వింటాను రూ.16,000కు కొనుగోలు చేయాలని, దళారులచే కాకుండా ప్రభుత్వమే నేరుగా ఆర్బీకే కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా కార్యవర్గ సభ్యులు కోలక అవినాష్, వైకుంఠరావు పాల్గొన్నారు.



గుజ్జువాయిలో పత్తి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

అంతర పంటలపై దృష్టి..



చలివేంద్రిలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఎ.ఓ సౌజన్య

వీరఘట్టం: రైతులు అంతర పంటలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయశాఖాధికారి జె.సౌజన్య సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చలివేంద్రి, కంబర గ్రామాల్లో రైతులకు పంటలపై సాగుపై గురువారం అవగాహన కల్పించారు. కోత దశలో ఉన్న వరి పంటను ఆశిస్తున్న మిత్ర, శత్రు పురుగులను గమనించాలన్నారు. వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, అనర్థాలను వివరించారు. కంబర పాఠశాలలో మన బడి – మన తోట కార్యక్రమంలో భాగంగా పెంచుతున్న కూరగాయలు, ఆకుకూరలను పరిశీలించి విద్యార్థులను అభినందిచారు.





కలుషిత నీరే గతి ...

సీతంపేట ఏజెన్సీ పరిధిలోని ఎగువ, దిగువ, మధ్య ద్వారబందం గ్రామాల ప్రజలు కలుషిత నీరు తాగుతూ రోగాల బారిన పడుతున్నారు. రక్షిత మంచినీటి పథకం, బోర్లు వంటివి ఆయా గ్రామాలకు చేరకపోవడంతో సుదూర ప్రాంతానికి వెళ్లి గ్రావిటేషన్ ఫ్లో నీరు తాగుతున్నారు. దీంతో టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్నా, పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఐటీడీఏ పీఓకు, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సీతంపేట